بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ



# దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి నిజమైన దాసులైన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పవిత్ర జీవిత ఆధారంగా ఎట్టి పరిస్థితిలోనైనా సత్యాన్ని అనుసరించడం ఆ విషయంలో తన ప్రత్యర్థులకు సవాలు విసిరిన సంఘటనల విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 01.05.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ
نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి నిజమైన దాసులైన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పవిత్ర జీవిత ఆధారంగా వారు ఎట్టి పరిస్థితిలోనైనా సత్యాన్ని అనుసరించడం, ఆ విషయంలో తన ప్రత్యర్థులకు సవాలు విసిరిన కొన్ని సంఘటనలను నేడు నేను వివరిస్తాను.

ఈ సంఘటన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవిత చరిత్రలో సత్యం పట్ల ఉన్న అసాధారణ నిబద్ధతను, ధైర్యాన్ని మరియు ప్రత్యర్థులను బహిరంగంగా ఎదుర్కొనే గొప్ప ఆదర్శాన్ని మన ముందు ఉంచుతుంది.

హుజూర్ (అలైహిస్సలాం) ఇట్లు ఉపదేశించారు: మౌల్వీ ముహమ్మద్ హుస్సేన్ బటాల్వి వారి (అ) పై అవిశ్వాసం మరియు అబద్ధం వంటి తీవ్రమైన ఆరోపణలు చేసినప్పుడు, వారు కేవలం తనను తాను రక్షించుకోవడానికే పరిమితం కాలేదు. కానీ పూర్తి విశ్వాసంతో, గౌరవంతో ఒక నిర్ణయాత్మకమైన సవాలును విసిరారు. వారు (అ) స్పష్టమైన మాటల్లో ఇలా అన్నారు. నా పూర్తి జీవితమే ఇందుకు సాక్ష్యం. నేను ఎప్పుడూ అబద్ధాన్ని ఆశ్రయించలేదు. సాధారణ పరిస్థితుల్లో కానీ, లేదా ప్రాణం, గౌరవం మరియు సంపదను కాపాడుకోవడానికి అబద్ధం చెప్పడం సులభమైన మార్గంగా ఉన్న క్లిష్ట సమయాల్లో కానీ నేను ఎన్నడూ అబద్ధం ఆడలేదు.

న్యాయస్థానాలలో కూడా విజయం సాధించాలంటే అబద్ధం చెప్పక తప్పదని న్యాయవాదులు స్పష్టంగా చెప్పిన చోట కూడా వారు (అ) సత్యానికే ప్రాధాన్యత ఇచ్చారని మరియు నష్టాన్ని భరించడానికి సిద్ధపడ్డారు తప్ప సత్యాన్ని మాత్రం వదలలేదని వారు (అ) వివరించారు. దీని తరువాత వారు (అ) అత్యంత శక్తివంతమైన రీతిలో తమ ప్రత్యర్థిని ఉద్దేశించి ఇలా అన్నారు. ఒకవేళ నీ వాదనలో నువ్వు నిజాయితీ పరుడివైతే కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా ఖచ్చితమైన మరియు స్పష్టమైన ఆధారాలను సమర్పించు. ఎందుకంటే ఒక సత్యవంతుడు మరియు దైవభీతి గల వ్యక్తి ఎప్పుడూ విచారణ చేయకుండా ఎవరిపైనా అవిశ్వాసం లేదా పాపం అనే ఆరోపణలు చేయడు. ఇది కేవలం ఆత్మరక్షణ మాత్రమే కాదు,

ఒక గొప్ప నైతిక మరియు ఆధ్యాత్మిక ప్రమాణాన్ని నెలకొల్పడం దీనివల్ల ప్రత్యర్థి స్వయంగా దోషిగా నిలబడవలసి వచ్చింది.

ఆపై వారు విషయాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళుతూ ఒక నిర్ణయాత్మక, అసాధారణమైన సవాలును విసిరారు. రండి, స్వయంగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు పవిత్ర ఖుర్ఆన్ దేనిని సత్యానికి చిహ్నంగా ప్రకటించాయో, ఆ ప్రమాణంపై మన ఇద్దరినీ పరీక్షించుకుందాం. అదే ఆధ్యాత్మిక సత్యం. (అనగా సత్యమైన కలలు మరియు దైవవాణి నిజాయితీ)

ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, అందులో ఇరుపక్షాలు తమ సాక్ష్యాధారాలను సమర్పించాలని ఎవరి సత్యమైతే స్పష్టమవుతుందో అదే సమయంలో రెండవ వారిని అసత్యవాదిగా దజ్జాల్‌గా మరియు అబద్ధాలకోరుగా అంగీకరించాలని వారు బహిరంగంగా ప్రకటించారు.

హుజూర్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. ఇక్కడ వారి ధైర్యం అత్యంత ఉన్నత స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తుంది. వారిలా అన్నారు. ఒకవేళ ఈ పరీక్షలో నేను అబద్ధాలకోరునని నిరూపితమైతే, నాపై మోపబడిన అవిశ్వాసం లేదా మోసం లేదా వంచన వంటి అన్ని ఆరోపణలను నేనే స్వయంగా అంగీకరిస్తాను. కానీ దైవం నా సత్యాన్ని వెల్లడిస్తే అప్పుడు అవే ఆరోపణలను మీపై అంగీకరించే ధైర్యం మీకు ఉందా? ఇవి కేవలం మాటలు మాత్రమే కాదు, సత్యంపై ఉన్న పరిపూర్ణ విశ్వాసం ప్రతిబింబించే అత్యంత బహిరంగమైన, నిష్పక్షపాతమైన మరియు స్పష్టమైన సవాలు.

చివరగా వారు పూర్తి విశ్వాసంతో మరియు దైవిక తేజస్సుతో ఇలా ప్రకటించారు. దైవమే స్వయంగా నిర్ణయిస్తాడు మరియు ప్రతి నిందారోపకుడి అసలు స్వరూపం బయటపడే సమయం దగ్గరలోనే ఉంది. ఎవరైతే ఇతరులను అవమానించడానికి పూనుకుంటారో వారు స్వయంగా అవమానానికి గురవుతారు. వారు సత్యాన్వేషిగా నా జీవిత చరిత్రను పరిశీలిస్తే, దైవం నన్ను ఎల్లప్పుడూ అసత్యం అనే అపవిత్రత నుండి కాపాడుతూ వచ్చాడనే విషయం మీకు ఖచ్చితమైన ఆధారాలతో స్పష్టమవుతుంది. ఎంతలా అంటే, కొన్నిసార్లు ఆంగ్ల న్యాయస్థానాలలో నా ప్రాణం మరియు గౌరవం ఎంతటి ప్రమాదంలో పడ్డాయంటే అబద్ధం చెప్పడం తప్ప వేరే మార్గం లేదని న్యాయవాదులు నాకు సలహా ఇచ్చారు. కానీ అల్లాహ్ అనుగ్రహంతో నేను సత్యం కోసం నా ప్రాణాన్ని, గౌరవాన్ని త్యాగం చేయడానికి సిద్ధపడ్డాను. అనేక సందర్భాల్లో ఆర్థికపరమైన వ్యాజ్యాలలో సత్యం కోసం నేను పెద్ద పెద్ద నష్టాలను భరించాను. కొన్నిసార్లు కేవలం దైవభీతితో నా తండ్రికి మరియు సోదరుడికి వ్యతిరేకంగా కూడా సాక్ష్యం ఇచ్చాను కానీ సత్యాన్ని మాత్రం వదలలేదు. నా నోటి నుండి అబద్ధం వచ్చిందని ఎవరు నిరూపించగలరు?

నేను కేవలం అల్లాహ్ కోసమే మనుషులపై అబద్ధం చెప్పడాన్ని ఆది నుండి వదిలివేసి, అనేకసార్లు నా ప్రాణాన్ని, సంపదను సత్యం కోసం త్యాగం చేసినప్పుడు, ఇక దేవునిపై ఎందుకు అబద్ధం చెబుతాను?

హుజూర్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. మరొక విషయం కూడా సత్యవంతులకు పరీక్షా సాధనంగా మారుతుంది. అదేమిటంటే కొన్నిసార్లు మనిషి ఎంతటి ఆపదలో చిక్కుకుంటాడంటే అబద్ధం తప్ప విముక్తికి మరో మార్గం అతనికి కనిపించదు. అప్పుడే అతని స్వభావంలో సత్యం ఉందా లేదా అసత్యం ఉందా అనేది పరీక్షించబడుతుంది. హుజూర్ అలైహిస్సలాం ఈ విషయంలో తన జీవితం నుండి మూడు నమూనాలను సమర్పించారు. **మొదటిది:** మిర్జా ఆజం బేగ్ గారు లాహోరీ ప్రయత్నం

వల్ల దాఖలైన ఆస్తి స్వాధీనం కేసు. **రెండవది:** తపాలా శాఖ కేసు మరియు **మూడవది:** హుజూర్ అలైహిస్సలాం గారి కుమారుడైన హజ్రత్ మిర్జా సుల్తాన్ అహ్మద్ గారు ఒక హిందువుపై వేసిన కేసు. ఆ హిందువు హుజూర్ అలైహిస్సలాం మరియు వారి కుటుంబ భూమిలో ఇల్లు నిర్మించుకున్నాడని, దానిని కూల్చివేయాలని ఆ కేసు ఉద్దేశం. అయితే ఆ కేసు క్రమంలో ఒక విషయం వాస్తవ విరుద్ధంగా (తప్పుగా) ఉంది. దీనిని గమనించిన ప్రత్యర్థులు, సాక్షుల జాబితాలో హుజూర్ అలైహిస్సలాం పేరును చేర్చి, మిర్జా గారు ఇచ్చే సాక్ష్యం మాకు సమ్మతమే అని అన్నారు. హుజూర్ అలైహిస్సలాం ఇట్లనిరి. కేవలం సత్యాన్ని గౌరవించడం కోసం ఆ కేసును నేను నా చేతులతోనే చెడగొట్టుకున్నాను (అంటే వాస్తవాన్ని ఒప్పుకున్నారు) మరియు సత్యానికే మొదటి ప్రాధాన్యతనిచ్చి ఆర్థిక నష్టాన్ని భరించాను.

ఇప్పుడు ఓ హజ్రత్ షేక్ గారు! అనగా మౌల్వీ గారినుద్దేశించి వారిలా ఉపదేశించారు. ఒకవేళ మీ వద్ద కూడా ఇటువంటి కఠిన పరీక్షకు సంబంధించిన ఏదైనా ఉదాహరణ ఉంటే అనగా సత్యం పలకడం వల్ల మీ ప్రాణం, గౌరవం మరియు సంపద నాశనమైపోతాయని మీకు స్పష్టంగా తెలిసినా, మీరు సత్యాన్ని వదలకుండా ప్రాణ, ధనాలకు అతీతంగా నిలబడిన సందర్భం ఏదైనా ఉంటే అల్లాహ్ సాక్షిగా ఆ సంఘటనను పూర్తి ఆధారాలతో సహా సమర్పించండి. లేదంటే ఈ కాలంలోని మెజారిటీ ముల్లాలు, మౌల్వీలు కేవలం మాటలకే పరిమితమని నా నమ్మకం. వారు ఒక్క పైసా కోసం తమ విశ్వాసాన్ని అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఎందుకంటే మన పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చివరి కాలపు మౌల్వీలను సృష్టిలోనే అత్యంత అధ్వాన్నమైన వారుగా వర్ణించారు. మరియు మీ ముజద్దిద్ (సంస్కర్త) నవాబ్ సిద్దీక్ హసన్ ఖాన్ గారు కూడా హిజజుల్ కిరామాలో ఆ చివరి కాలం ఇదేనని అంగీకరించారు. కనుక అటువంటి మౌల్వీల భక్తిని, దైవభీతిని ఎటువంటి ఆధారాలు లేకుండా అంగీకరించడం అంటే, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాటలను ధిక్కరించడమే అవుతుంది. కావున మీరు ఏదైనా ఉదాహరణను సమర్పించండి! ఒకవేళ మీరు అలా చేయలేకపోతే సత్యం గురించి మీకు కేవలం వాదనలు మాత్రమే ఉన్నాయని కానీ పరీక్షకు నిలవని ఏ వాదన కూడా అంగీకారయోగ్యం కాదని నిరూపితమవుతుంది. వారెప్పుడైనా అసత్యం, నిందారోపణలనే అపవిత్రతలో చిక్కుకున్నారో లేదో వారి అంతరాత్మ ఆ దైవానికే తెలుసు. పరోక్ష జ్ఞానం అతనికే తెలుసు, లేదా మీ పరిస్థితులతో పరిచయం ఉన్నవారికి తెలుసు. ఏ వ్యక్తి అయితే కష్టకాలంలో సత్యవంతుడిగా నిలబడి, సత్యాన్ని వదలడో అతని నిజాయితీపై ధ్రువీకరణ ముద్ర పడుతుంది. అటువంటి ముద్ర మీ వద్ద ఉంటే చూపించండి, లేదంటే దైవానికి భయపడండి! ఆయన మీ గుట్టును రట్టు చేయకుండా ఉండాలని ప్రార్థించండి.

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. ప్రత్యర్థి పక్షం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సాక్ష్యాన్ని కోరిందని హజ్రత్ సాహబ్జాదా మిర్జా సుల్తాన్ అహ్మద్ గారికి తెలిసినప్పుడు హుజూర్ అలైహిస్సలాం ఎన్నటికీ అబద్ధం చెప్పరని ఆయనకు తెలుసు కాబట్టి, ఆయన ఆ కేసునే ఉపసంహరించుకున్నారు.

హుజూరె అన్వర్ ఆ ఇంటి చరిత్రను కూడా వివరించారు. ఆ ఇల్లు డెప్యూటీ శంకర్ దాస్ హవేలీగా పిలువబడేది. అతను అత్యంత మతోన్మాది, వ్యతిరేకి. ఆ ఇంటి వల్ల హుజూర్ అలైహిస్సలాం నివాసాల గోప్యతకు (పర్దా) భంగం కలిగేది. పైగా ఆ వ్యక్తి నమాజుకు వెళ్లేవారిని, వచ్చేవారిని అసభ్య

పదజాలంతో దూషించేవాడు. నమాజీలు అతని ప్రవర్తన గురించి హుజూర్ అలైహిస్సలాంకు ఫిర్యాదు చేసినప్పుడు ఓపిక పట్టండి! రాజ కోట ముందు ఎవరూ నిలబడలేరని హుజూర్ (అ) బదులిచ్చారు. చూస్తుండగానే ఆ డెప్యూటీ ఇల్లు కూలిపోవడం ప్రారంభమైంది మరియు అతను అనారోగ్యంతోనో లేదా మరేదైనా కారణంతోనో అక్కడి నుండి వెళ్ళిపోయాడు. తరువాత ఆ ఇంటిని హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ (రజి) కొనుగోలు చేశారు. 1932 సంIIలో ఆ ఇంట్లోనే సదర్ అంజుమన్ అహ్మదియ్యా కార్యాలయాలను ఏర్పాటు చేశారు. దానిని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) స్వయంగా ప్రారంభించారు. ఇది దైవ మహిమ! ఒకప్పుడు ఏ వ్యక్తి అయితే ఎంతో గర్వంతో మసీదుకు వెళ్లేవారిని అడ్డుకున్నాడో నేడు దైవ నిర్ణయం వల్ల అతని ఇల్లు మరియు ఆ ప్రాంతమంతా మసీదుగా మారిపోయింది. ఇప్పుడు ఆ ఇల్లు అక్సా మసీద్‌లో ఒక భాగం.

హజ్రత్ మియాఁ అల్లాహ్ యార్ గారు (రజి) ఇలా వివరిస్తున్నారు: హజ్రత్ గారు (అ) వయస్సు ఇరవై ఐదు లేదా ముప్పై ఏళ్లు ఉన్నప్పుడు, వారి తండ్రి గారికి మరియు వారి కౌలుదారులకు చెట్లు నరకడంపై ఒక వివాదం తలెత్తింది. భూమి మాదే కాబట్టి చెట్లు కూడా మా ఆస్తియే అని హుజూర్ (అ) తండ్రి గారి అభిప్రాయం. వారు (అ) ఆ కేసు విచారణ కోసం గురుదాస్‌పూర్ వెళ్లారు, వారితో పాటు ఇద్దరు సాక్షులు కూడా ఉన్నారు. హుజూర్ (అ) మార్గమధ్యలో సాక్షులతో ఇలా అన్నారు. నాన్నగారు ఊరికే పట్టుబడుతున్నారు. చెట్లు కూడా పంటల వంటివే కదా. వారు పేదవారు, ఒకవేళ వారు నరికితే వచ్చే నష్టం ఏముంది? ఇవి పూర్తిగా మావే అని నేను కోర్టులో చెప్పలేను. నిస్సందేహంగా వీటిలో మాకు వాటా ఉండవచ్చు. కౌలుదారులకు కూడా హుజూర్ (అ) పై గట్టి నమ్మకం ఉండేది. న్యాయమూర్తి వారిని అడిగినప్పుడు వారు ఏమాత్రం తటపటాయించకుండా స్వయంగా మిర్జా గారినే అడగండని సమాధానమిచ్చారు. వారిని అడిగినప్పుడు వారు (అ) ఇలా బదులిచ్చారు. నా దృష్టిలో చెట్లు కూడా పంట లాంటివే. పంటలో మాకు ఎలాగైతే వాటా ఉందో అలాగే చెట్లలో కూడా మాకు వాటా ఉంది. వారి ఈ వాంగ్మూలం ఆధారంగా న్యాయమూర్తి కౌలుదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి జీవితం నుండి సత్యానికి సంబంధించిన కొన్ని సంఘటనలను సమర్పించాను. వారు (అ) ఎల్లప్పుడూ సత్యానికే ప్రాధాన్యత ఇచ్చారు మరియు అబద్ధానికి కనీసం దరిదాపుల్లోకి కూడా వెళ్లలేదు. వారు (అ) తనను అనుసరించేవారికి కూడా ఎల్లప్పుడూ సత్యంపై స్థిరంగా ఉండాలని ఉద్బోధించారు. అంతేకాకుండా బైఅత్ (ప్రమాణ స్వీకారం) నిబంధనలలో కూడా మనం అబద్ధాన్ని అసహ్యించుకుంటామని మరియు సదా సత్యంపై నిలిచి ఉంటామని వ్రాయబడి ఉంది. కనుక సత్యాన్ని మన ప్రత్యేక లక్షణంగా మార్చుకోవడం మన కర్తవ్యం. అల్లాహ్ తఆలా మనకు దీనిని ఆచరించే భాగ్యాన్ని ప్రసాదించుగాక! (ఆమీన్)

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ
اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ
وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ
وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔